



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 12 సంచిక : 217 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 12 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :217 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 12 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# టీడీపీ క్యాడర్ తో చంద్రబాబు కాఫీ కబుర్లు...





- కార్యకర్తలతో 'కాఫీ కబుర్లు' పేరుతో సీఎం చంద్రబాబు సమావేశం
- క్లీన్ పాలిటిక్స్‌కు టీడీపీని కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని దిశానిర్దేశం
- క్వాంటం టెక్నాలజీతో ఏపీని అభివృద్ధి చేస్తామని వెల్లడి
- గత ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలను తగ్గిస్తున్నామన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'కాఫీ కబుర్లు' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు రాజకీయ, పరిపాలనా అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో నిజాయతీగా ఉంటేనే విలువ ఉంటుందని, ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలు చేయాలి కానీ జీవనోపాధిగా ఎంచుకోకూడదని ఆయన హితవు పలికారు. క్లీన్ పాలిటిక్స్‌కు టీడీపీని కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నాడు ఐటీతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్టే, నేడు క్వాంటం టెక్నాలజీతో ఏపీని, అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం. ఈ నెల 14న క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభిస్తాం" అని వెల్లడించారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచిందని, తమ ప్రభుత్వం ఛార్జీలను తగ్గిస్తోందని స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ఫీడ్‌బ్యాక్ తీసుకోగా, తమ విద్యుత్ బిల్లుల భారం తగ్గిందని పలువురు కార్యకర్తలు ముఖ్యమంత్రికి తెలిపారు.
సమగ్ర నీటి నిర్వహణ ద్వారా ప్రాజెక్టులను నింపామని, మే 15 నాటికే పంటలకు నీరు అందిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రతి కులానికి దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు.



## అమరావతి 'ఘోస్ట్ క్యాపిటల్'గా మారే ప్రమాదం ఉంది

- రాష్ట్ర ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం తాకట్టు పెడుతోందన్న అమర్నాథ్
- ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన
- వైసీపీ హయాంలోనే విశాఖ రైల్వే జోన్ సాధ్యమైందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని నిర్మాణం, ఉత్తరాంధ్ర అభివృద్ధి అంశాలపై మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు అధికారం ఇచ్చి నాలుగోసారి మోసపోయారని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణను విస్మరించి, కేవలం అమరావతిపైనే లక్షల కోట్లు కుమ్మరించడం వల్ల ఉత్తరాంధ్ర తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని

మిగతా 2లో



## మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- జిమ్ లో మంత్రి టీజీ భరత్ కఠినమైన వర్కౌట్లు
- ఆయన కసరత్తులను రాష్ట్ర పెట్టుబడులతో ముడిపెట్టిన లోకేశ్
- అడ్డంకులు దాటుతూ పెట్టుబడులకు అనువైన వాతావరణం సృష్టిస్తున్నారని వ్యాఖ్య
- వీడియోను పంచుకున్న వైనం

మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికరమైన రీతిలో ప్రశంసలు కురిపించారు. జిమ్‌లో టీజీ భరత్ కఠినమైన వ్యాయామాలు చేస్తున్న వీడియోను షేర్ చేసిన లోకేశ్, ఆయన కసరత్తులను రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణంతో ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కలిగిస్తున్నాయి. టీజీ భరత్ జిమ్‌లో జంపింగ్స్ తో కూడిన వర్కౌట్ చేస్తున్న వీడియోను

## ఏపీలో 61 రోజుల చేపల వేట నిషేధం.. ఏప్రిల్ 15 నుంచి అమలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక
- వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ. 20 వేల ఆర్థిక సాయం
- ప్రభుత్వం అందిస్తున్న ప్రమాద బీమా రూ. 10 లక్షలకు పెంపు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో సముద్రంలో చేపల వేటపై నిషేధం అమల్లోకి రానుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిషేధం కొనసాగుతుంది. ఈ మేరకు రాష్ట్ర మత్స్యశాఖ అధికారికంగా

మిగతా 2లో





## కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం

### కారుపై బోల్తా పడిన ట్యాంకర్.. న్యాయవాది మృతి

- ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- బ్రేకులు ఫెయిల్ కావడంతో కారుపై బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్
- ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు.. ఒకరు అక్కడికక్కడే మృతి
- క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను తొలగించి మృతదేహాన్ని వెలికితీత
- ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:**ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద శని వారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బ్రేకులు విఫలం కావడంతో ఓ సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి బీఎండబ్ల్యూ కారుపై బోల్తా పడింది.

మిగతా 2లో



## అప్పులు కట్టలేక అమెరికా వీడిన జో బైడెన్ కుమారుడు

- అప్పుల ఊబిలో బైడెన్ కుమారుడు హంటర్
- దేశం విడిచి విదేశాల్లో నివసిస్తున్నట్లు వెల్లడి
- న్యాయవాదుల ఫీజులు కూడా చెల్లించలేని దీనస్థితి
- దాదాపు రూ.158 కోట్ల మేర అప్పులు ఉన్నట్లు సమాచారం
- దక్షిణాఫ్రికాలో ఉండొచ్చని అధికారుల అనుమానం

మిగతా 2లో

# బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు



- బెంగాల్ సభల్లోని ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదన్న ప్రధాని
- మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు ఖాయమని జోస్యం
- టీఎంసీ 15 ఏళ్ల పాలనలోని అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న మోదీ
- తొలి కేబినెట్ భేటీలోనే ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.

**బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం: మోదీ హామీ**

ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం

మిగతా 2లో



## ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా చర్చలు...

### జేడీ వాన్స్ కు స్వాగతం పలికిన షరీఫ్

- శాంతి స్థాపన కోసం అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు
- పాక్ ప్రధాని షెహబాజ్‌తో అమెరికా వైస్ ప్రెసిడెంట్ భేటీ
- శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్
- ప్రాంతీయ శాంతి స్థాపనే లక్ష్యంగా ఈ చర్చలు
- భేటీలో పాల్గొన్న జేడీ వాన్స్, జారెడ్ కుష్నర్

మిగతా 2లో

## 'వి వి గన్'గా మార్చుకోండి

### జగన్ పార్టీపై హోంమంత్రి అనిత సెటైర్స్



**పెన్ పవర్ డెస్క్:**రాజకీయ స్వార్థం కోసం కన్నతల్లిని, చెల్లెలిని కూడా వైఎస్ జగన్మోహన్ రెడ్డి

మిగతా 2లో

## 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...

- దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్‌కు చెక్
- బ్రహ్మోస్ కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు
- అమెరికా భద్రతా హామీలపై సందేహాలు పెరగడంతో భారత్ వైపు చూస్తున్న దేశాలు
- భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి కొనుగోలుకు ఇండోనేషియా నిర్ణయం
- ఇప్పటికే ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ అందించిన భారత్, వియత్నాంతోనూ చర్చలు

మిగతా 2లో



## 2028 నుంచి ఆ బైక్‌ల రిజిస్ట్రేషన్ బంద్..

- ఢిల్లీలో పెట్రోల్ టూ-వీలర్లకు చెక్.. 2028 నుంచి రిజిస్ట్రేషన్ల బంద్!
- 2027 జనవరి నుంచే పెట్రోల్, సీఎన్‌జీ ఆటోల రిజిస్ట్రేషన్లు బంద్
- కొత్త ఈవీ టూవీలర్ కొంటే రూ.30,000 వరకు సబ్సిడీ
- పాత పెట్రోల్ వాహనాన్ని స్క్రాప్ చేస్తే రూ.10,000 అదనపు ప్రోత్సాహకం
- వాయు కాలుష్యం నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# మహనీయుల స్ఫూర్తితో కుల వివక్షను తరిమికొడదాం

'కుల వివక్ష ఇప్పుడు ఎక్కడుంది? ఇప్పుడంతా మారిపోయింది అందరూ కలిసి తింటున్నారు. కలిసి తిరుగుతున్నారు. హోటళ్లలో, జాతర్లలో, ఉత్సవాల్లో అన్నింట్లో కలిసే ఉంటున్నారు. ఇంకెక్కడుంది?' ఈమధ్య మనువాదుల నుండి ఈ మాటలు వినిపిస్తున్నాయి. మోడీ పాలనలో దేశం చాలా మారిందంటున్నారు. వివక్ష లేనే లేదంటున్నారు. కానీ?నేటికీ నిచ్చెన మెట్ల కుల జాడ్యం అణగారిన ప్రజల్ని పట్టి పీడిస్తూనే ఉంది.మాలమాదిగ పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కనిపిస్తూనే ఉంది. అయితే గతంలో ఉన్నంత మొరటుగా ఇప్పుడు లేకపోవచ్చు కానీ, కులవివక్ష రూపం మార్చుకుని మరో రూపంలో కొనసాగుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగం ఇంత అభివృద్ధి చెంది మంచి ఫలితాలు సాధిస్తుంటే ఇదేం కులవివక్ష అనుకోవచ్చు. స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత కొనసాగడానికి అగ్రవర్ణాల ఆధిపత్యంతో నడిచే పాలక ప్రభుత్వాలే కారణమని చెప్పవచ్చు.మన రాష్ట్రంలోనూ దళితులపై దుర్మార్గమైన దాడులు, దౌర్జన్యాలు, లైంగిక అకృత్యాలు, హత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని జాతీయ నేర విభాగం నివేదికలు తెలుపుతున్నాయి. నగరాల్లో శాకాహారులకు మాత్రమే ఇళ్లు అద్దెకిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు అద్దెకు ఇవ్వరు. పైగా 'శాకాహారులకు మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అని తమ ఇంటి గోడలు, గేట్‌లకు బోర్డులు పెడుతున్నారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 164 రకాల కులవివక్ష రూపాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పరిష్కారం కోసం సూచనలు చేసింది. కమిషన్ ఏర్పాటు చేసిన పాలకులు ఆ సూచనలను చిత్తశుద్ధితో అమలు చేయాలి కదా! నేటికీ పున్నయ్య సిఫారసు చేసిన నలభై అంశాల్ని సర్కార్ పట్టించుకోవడమే లేదు. ఫలితంగా నేటికీ కుల వివక్ష రూపాలు కొనసాగుతున్నాయి. పున్నయ్య కమిషన్ చేసిన సిఫారసుల్లో ప్రధానమైనది?వారంలో ఒకరోజు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కుల వివక్షను గుర్తించి దాన్ని రూపుమాపడానికి ప్రయత్నించడం. కానీ ఎక్కడా ఆ సిఫారసు అమలుకు నోచుకోవటం లేదు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెల చివరి రోజు కుల వివక్ష, అంటరానితనంపై చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నది. కానీ దాన్ని ఎక్కడా అమలు జరపటం లేదు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగిన సందర్భంలో ఏకైక రక్షణ కవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నారు. 41 సి.ఆర్.పి.సి కింద స్టేషన్ బెయిలిస్తూ దాడులు మరింతగా పెంచడానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆరెస్సెస్-బిజెపి మనువాద మతోన్మాద విధానాలు పల్లెల వాతావరణాన్ని చెదరగొడుతున్నాయి. కుల వివక్ష, అంటరానితనాన్ని మరింతగా విస్తృత పరుస్తున్నాయి. చినజీయర్ స్వామి లాంటి వారు 'కులం ఉండాల్సిందే, కులం పోకూడదు. ఒక మనిషి శరీరానికి కాళ్లు రెక్కలు ఎంత అవసరమో, దేశానికి కులాలు అంత అవసరం' అని ప్రబోధిస్తున్నారు. గ్రామ సీమల్లో దళితులు అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే?దానికి పోటీగా ఆరెస్సెస్ వారు?ఇతరులను రెచ్చగొట్టి, ఇతర నాయకుల విగ్రహాలను పెట్టి ప్రజల మధ్య ఘర్షణలను సృష్టించి కులాల కుంపటిని రగిలించి రాజకీయాలు నడుపుతున్నారు. పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతుల సందర్భంగా దండలేసి దండాలు పెట్టి వారి ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు కొందరు. కానీ పూలే, అంబేద్కర్ తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలు నిర్మించారు. వాటి గురించి మాత్రం ఆలోచించరు. పూలే-అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తున్న కె.వి.పి.ఎస్?నేటికీ కొనసాగుతున్న కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలను చేయసాగింది. అందులో భాగంగానే ఈ నెల 11 (పూలే జయంతి) నుండి 14 (అంబేద్కర్ జయంతి) వరకు ఈ ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. క్షేత్ర స్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు చేసి ప్రత్యక్ష ప్రతిఘటనా పోరాటాలు నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. సమాజహితం కోరుకునే వ్యక్తులు, శక్తులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ ఈ ఉద్యమాల్లో పాలుపంచుకోవాలని కె.వి.పి.ఎస్ పిలుపునిస్తోంది. చాప కింద నీరులా పాకుతున్న మనువాద సంస్కృతి, కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా రూపుమాపబడాలంటే ప్రజలు ఐక్యంగా పూనుకోవాలి. వీటిని ప్రతిఘటించి పారదోలాలి.

# అమరావతి 'ఘోస్ట్ క్యాపిటల్'గా మారే ప్రమాదం ఉంది

- మొదటి పేజి తరువాయి

అమర్నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న అమరావతి నగరం ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ తెలియదని, అది భవిష్యత్తులో జన సంచారం లేని "ఘోస్ట్ క్యాపిటల్" (నిర్జన నగరం)గా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా మలేషియాలోని 'పుత్రజయ' నగరాన్ని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. కేవలం భవనాలు కడితే సరిపోదని, ప్రజా జీవనం లేకపోతే ఆ నగరం నిరర్థకమవుతుందని అభిప్రాయపడ్డారు.ఐదు దశాబ్దాల పోరాటం తర్వాత వైసీపీ హయాంలోనే విశాఖ రైల్వే జోన్ సాధ్యమైందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం దానిపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. రైల్వే జోన్ కోసం తాను చేపట్టిన దీక్షపై కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తూ, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కీలకమైన కేకే (ఖఖ) రైల్వే లైన్ ఒడిశాకు వెళ్లిపోతుండటం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని, ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని అమర్నాథ్ విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా ప్రభుత్వం రాజీపడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీ ఎప్పుడూ అభివృద్ధి వికేంద్రీకరణకే కట్టుబడి ఉంటుందని, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. కేవలం ఒకే ప్రాంతంపై దృష్టి పెట్టి మిగిలిన రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# 2028 నుంచి ఆ బైక్‌ల రిజిస్ట్రేషన్ బంద్..

: దేశ రాజధానిలో కాలుష్యానికి చెక్‌పెట్టేలా.. ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మొగ్గు చూపేలా దిల్లీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వెహికిల్ ముసాయిదా పాలసీ (2026-30)ని దిల్లీ ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది . ఇందులో కీలక ప్రతిపాదనలు ఇవే..

2027, జనవరి ఒకటి నుంచి ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే అనుమతి ఉంటుంది. ఆ తర్వాత టూవీలర్స్‌ను ఆ జాబితాలోకి తీసుకువస్తారు. ఏప్రిల్ 1, 2028 నుంచి ఎలక్ట్రిక్ మోడల్స్ రిజిస్ట్రేషన్‌ను మాత్రమే అనుమతించనున్నారు. దిల్లీ నగరంలో పెట్రోల్, డీజిల్ వాహనాలను క్రమంగా తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.ప్రజలను ఈవీ కొనుగోళ్ల వైపు మళ్లించేందుకు ప్రోత్సాహకాలను దిల్లీ రవాణా శాఖ ప్రతిపాదించింది. ఈవీల్లోకి మారితే విద్యుత్ వినియోగం పెరుగుతుంది గనక రూ.2.25 లక్షల విలువైన టూవీలర్‌ను కొంటే.. ఒక కిలోవాట్‌అవర్‌కు రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు ప్రోత్సాహకం అందనుంది. త్రీవీలర్ ఈవీలకు తొలి ఏడాది రూ.50వేలు లభిస్తాయి. క్రమంగా ఆ మొత్తం తగ్గుతూ వస్తుంది. పాతవాహనాలు తుక్కుగా మార్చి, ఈవీల్లోకి మారినా ఈ ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఈవీల కోసం ప్రభుత్వం ఛార్జింగ్ సౌకర్యాలను భారీగా పెంచనుంది.

ఈ కొత్త ప్రతిపాదనలను అభిప్రాయ సేకరణ కోసం 30 రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంచారు. వాటిని పరిగణనలోకి

తీసుకొని తర్వాత తుదిరూపు ఇవ్వనున్నారు. కాగా.. ప్రతి శీతాకాలం దిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. దాంతో అక్కడి ప్రజలు శ్వాస సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియోకు ఆయన ఓ ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. "రాష్ట్రంలో అత్యుత్తమ పెట్టుబడి వాతావరణాన్ని అందించడానికి మా పరిశ్రమల మంత్రి టీజీ భరత్ గారు ఇలా అడ్డంకులను దాటుతున్నారు" అంటూ లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో పాటు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'చూజ్ స్పీడ్ చూజ్ ఏపీ' అనే హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

# ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా చర్చలు...

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపనే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య కీలక చర్చలకు అంతా సిద్ధమైంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ ఈ చర్చలకు వేదికగా నిలిచింది. ఈ చర్చల ప్రారంభం సందర్భంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, పాకిస్థాన్ ప్రధానమంత్రి ముహమ్మద్ షెహబాజ్ షరీఫ్‌తో శనివారం సమావేశమయ్యారు.ఈ భేటీలో వాన్స్‌తో పాటు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొన్నారు. ప్రధాని షరీఫ్‌కు సహాయకులుగా ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, అంతర్గత వ్యవహారాల మంత్రి మోహసిన్ రజా నఖ్వీ హాజరయ్యారు. ఇరు దేశాల ప్రతినిధులు నిర్మాణాత్మక ధోరణితో చర్చల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం పట్ల పాక్ ప్రధాని ప్రశంసించారు.ఈ చర్చలు ఈ ప్రాంతంలో సుస్థిర శాంతికి ఒక మెట్టుగా నిలుస్తాయని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి పునరుద్ధరణ కోసం ఇరు దేశాలకు తమ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్న ఈ చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం లభిస్తుందని పలు దేశాలు ఆశిస్తున్నాయి.

# 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం. భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు 'ఇండియా నరేటివ్' తన కథనంలో వివరాలను వెల్లడించింది.ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన ~2/~ాణ వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది.ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది.ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి.

భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# 'వి వి గన్'గా మార్చుకోండి

- మొదటి పేజి తరువాయి

మోసం చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణాన్ని సైతం రాజకీయ లబ్ధికి ఉపయోగించుకున్నారని ఆమె ఆరోపించారు. విభజన సమయంలో సోనియా గాంధీ తో లాలూచీ పడి జగన్ బెయిల్ తెచ్చుకున్నారన్నారని తెలిపారు. తన కోసం పాదయాత్ర చేసిన షర్మిలను సైతం పక్కన పెట్టడం ఆయన నైజానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తన ఐదేళ్ల పాలనలో విశాఖ లో భూకబ్జాలకు పాల్పడ్డారని , ఆ దెబ్బతో పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లిపోయారని హోంమంత్రి అనిత విమర్శించారు. వైసీపీ కి "వి వి గన్" అని పేరు మార్చుకుంటే బాగుంటుందని అనిత సలహా ఇచ్చారు. ప్రజలకు సినిమా చూపిస్తానన్న జగన్‌కు, ఎన్నికల్లో ప్రజలే అసలైన సినిమా చూపించారని ఆమె ఎద్దేవా చేశారు.

# బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు

- మొదటి పేజి తరువాయి

విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు.తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ

స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఏపీలో 61 రోజుల చేపల వేట నిషేధం.. ఏప్రిల్ 15 నుంచి అమలు

- మొదటి పేజి తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. సముద్ర జీవ సంపద పరిరక్షణలో భాగంగా ఏటా ఈ నిర్ణయం తీసుకుంటున్నారు.సంతానోత్పత్తి కోసమే ఈ విరామం ప్రతి ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల మధ్య కాలం చేపలు, ఇతర సముద్ర జీవుల సంతానోత్పత్తికి అత్యంత కీలకమైన సమయం. ఈ నేపథ్యంలో సముద్ర జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం ఏటా ఈ వేట విరామాన్ని ప్రకటిస్తుంది. ఈ సమయంలో మత్స్యకారులు ప్రభుత్వానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలను ఉల్లంఘించి వేటకు వెళ్లే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 5 వేల జరిమానాతో పాటు వారి వలలను స్వాధీనం చేసుకుని, బోటు రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తారు.చేపల వేట విరామ సమయంలో మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ఏప్రిల్ 17 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వివరాల సేకరణ చేపట్టనున్నారు. ఇది కాకుండా వేటకు వెళ్లే బోట్లకు డీజిల్ సబ్సిడీ, రాయితీపై ఇంజిన్లు, వలలు, తెప్ప వంటి పరికరాలను కూడా ప్రభుత్వం అందిస్తోంది. ముఖ్యంగా మోటార్ ఇంజిన్ల కొనుగోలుపై 40 శాతం రాయితీ కల్పిస్తున్నారు. భారీగా పెరిగిన బీమా సౌకర్యం మత్స్యకారుల భద్రతకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని భారీగా పెంచారు. గతంలో రూ. 2 లక్షలుగా ఉన్న ఈ బీమాను ఇప్పుడు రూ. 10 లక్షలకు పెంచారు. అలాగే, సాధారణ మరణం లేదా ప్రమాదం సంభవించినా కార్మిక శాఖ ద్వారా రూ. 2 లక్షల పరిహారం అందుతుంది. ఈ బీమా సౌకర్యాలు పొందాలంటే మత్స్యకారులు తప్పనిసరిగా సహకార సంఘంలో సభ్యులై ఉండాలి. అలాగే, ఫిషింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు కలిగి ఉండి, మత్స్యశాఖ అధికారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం సమీపంలోని మత్స్యశాఖ కార్యాలయాలను లేదా గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

# కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం

## కారుపై బోల్తా పడిన ట్యాంకర్.. న్యాయవాది మృతి

- మొదటి పేజి తరువాయి

ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఓ న్యాయవాది అక్కడికక్కడే మృతి చెందారు.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ కీసర టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే బ్రేకులు పని చేయలేదు. దీంతో అదుపుతప్పిన ట్యాంకర్, ముందు వెళుతున్న కారు (టూ 09 ఖీ 6662) మీదకు దూసుకెళ్లి బోల్తా పడింది. భారీ ట్యాంకర్ కింద కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ట్యాంకర్‌ను తొలగించేందుకు క్రేన్లు, జేసీబీలను రంగంలోకి దించారు. సుమారు గంటపాటు శ్రమించి ట్యాంకర్‌ను పక్కకు తీసి, కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికితీశారు. వాహన రిజిస్ట్రేషన్ ఆధారంగా కారు యజమాని హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడకు చెందిన హైకోర్టు న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అవ్వడమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అప్పులు కట్టలేక అమెరికా వీడిన జో బైడెన్ కుమారుడు

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ దేశాన్ని వీడినట్లు తెలుస్తోంది. హంటర్ బైడెన్ విదేశాల్లో నివసిస్తున్నట్లు ఆయన న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఎక్కడున్నారన్న విషయంపై తనకు కూడా స్పష్టత లేదన్నారు. తనకు చెల్లించాల్సిన 50,000 డాలర్ల బకాయిలను కూడా చెల్లించలేదని తెలిపారు. అమెరికాలో 17మిలియన్ డాలర్ల (దాదాపు రూ.158కోట్లు) అప్పు ఉన్న సమయంలో హంటర్ యూఎస్‌ను వీడడం గమనార్హం. తాను అప్పుల్లో కూరుకుపోయినట్లు హంటర్ బైడెన్ గతేడాది ఓ ఇంటర్వ్యూలోనూ వెల్లడించారు. హంటర్ బైడెన్ ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉండే అవకాశం ఉన్నట్లు అమెరికా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**హంటర్‌పై కేసులు..**

2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తనవద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత ఆరోపణలపై కేసు నమోదైంది.

అక్రమ ఆయుధం కొనుగోలు వ్యవహారంలో హంటర్‌పై నమోదైన కేసులో 2024 జూన్‌లో న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. అమెరికా అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో జో బైడెన్ (జీశీవ దీఆఎవఅ) అక్రమ ఆయుధం కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆరోపించారు.

## జర్రెల కొత్తూరులో భారీ పాము సంచారం -- గ్రామస్థుల్లో భయాందోళన

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 11:**గూడెంకొత్తవీధి మండలంలోని జర్రెల కొత్తూరు గ్రామంలో భారీ పాము సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. శనివారం రాత్రి సమీప అడవి నుంచి సుమారు 15 అడుగుల పొడవైన పాము గ్రామంలోకి ప్రవేశించింది.పాము ఓ ఇంట్లోకి దూరడంతో అక్కడి గిరిజనులు భయంతో పరుగులు తీశారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తమై సుమారు గంటన్నర పాటు శ్రమించి పామును హతమార్చినట్లు తెలిపారు. పాము గ్రామంలో హల్చల్ చేస్తూ కాటు వేసేందుకు ప్రయత్నించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చంపినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# పోక్సో కేసుల్లో కఠిన చర్యలు







**న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం పెరిగింది: హోంమంత్రి అనిత**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** రాష్ట్రంలో చట్టాలు మరియు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం గణనీయంగా పెరిగిందని ఆం ధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొ న్నారు. న్యాయవ్యవస్థ పటిష్ఠంగా పనిచేస్తుండ టంతో నేరస్తులకు కఠిన శిక్షలు పడుతున్నాయ ని ఆమె తెలిపారు.శనివారం విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా మరియు బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో హోంమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ పబ్లిక్ ప్రాసిక్యూషన్ బాధ్యత ఎంతో గౌరవప్రదమైనదని, న్యాయం జరిగే ప్రక్రియలో ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

పోక్సో కేసుల్లో ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబి స్తోందని, నిందితులకు సులభంగా బెయిల్ లభించకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా న్యాయపరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.అలాగే 'ఆపరేషన్ ట్రేస్' కార్యక్రమం ద్వారా ఇప్పటివర కు సుమారు 900 మంది పిల్లలను రక్షించామ ని, విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న 180 మంది ని సురక్షితంగా తిరిగి స్వదేశానికి తీసుకు వచ్చినట్లు వివరించారు. పోలీసు శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందిస్తూ సామర్థ్యాన్ని పెంచుతున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు సహా దాదాపు 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఈ సందర్భంగా సత్కరించారు.

పోలీసు శాఖ మరియు న్యాయవ్యవస్థ పరస్పర సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజలకు సమర్థవంతమైన న్యాయం అందుతుందని, అదే ప్రజాస్వామ్య బలపాటుకు దోహదపడు తుందని హోంమంత్రి అనిత తెలిపారు.

## నేలపాడు గ్రామంలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుక





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 11:** రింతాడ పంచాయతీ పరిధిలోని నేలపాడు గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్ (ఆల్ ఇండియా ఆదివాసి స్వయం పాలన సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు) ఆధ్వర్యంలో ప్రజలు, చిన్నారుల మధ్య ఈ కార్యక్రమాన్ని "మహనీయుల స్ఫూర్తి దినంగా" నిర్వహించారు.ఈ సందర్భంగా సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, సామాజిక విప్లవ స్ఫూర్తి ప్రదాతగా పూలే చేసిన సేవలు, త్యాగాలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆదివాసుల పోరాట చరిత్రను, నేటి పరిస్థితులను గుర్తుచేస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాపాడుకోవడానికి ఆదివాసులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మహనీయుల స్ఫూర్తితో సమాజ మార్పు సాధ్యమని, బాల్య వివాహాలను నివారిస్తూ పిల్లలకు మంచి విద్య అందించాలని ఆయన సూచించారు.కులమతాలకతీతంగా ఐక్యతతో ముందుకు నడవాలని ఆయన ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రజల చైతన్యం కోసం మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా గతంలో ఆరేళ్లపాటు పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన సోమేశ్వరరావును ప్రజలు మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకంతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ నాని బాబు,గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా -- గ్రీన్ పార్క్ వద్ద నివాళులు





**విశాఖపట్నం ఏప్రిల్ 11(పెన్ పవర్)**ప్రముఖ సామాజిక సంస్కర్త, విద్యావేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా దక్షిణ నియోజకవర్గంలో గ్రీన్ పార్క్ వద్ద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మేధావి జ్యోతిరావు పూలే అని, విద్య ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించవచ్చని విశ్వసించిన మహానుభావుడని పేర్కొన్నారు.

29వ వార్డు జనసేన అధ్యక్షుడు అంగటి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, స్త్రీ విద్య, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పూలే ఆలోచనలు నేటికీ ఆదర్శప్రాయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో గొలగాని రవిశ్వరావు, దేవాడ శేఖర్, యాకాల మురళి కృష్ణ, భూలక్ష్మి, మజ్జి అప్పలరాజు, కర్రి చిన్ని, సొండి శివ, ఒమ్మి సాయి, పిల్లా శ్రీనివాస్, లక్ష్మణ్, కొవ్వూరు సాయి, లోకేష్, పండు, పడిమి కిషోర్ తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

## పాలకుల అనుమతితో ఆలయ నిర్మాణం !







**అనధికార ఆలయ నిర్మాణానికి ప్రజా ప్రతినిధుల అండదండలు !**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్ 11:** విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డు ఆఖరి బస్టాప్ వద్ద ప్రభుత్వ భూమిలో అనధికార ఆలయ నిర్మాణానికి ప్రజా ప్రతినిధుల అనుమతితో నిర్మాణానికి అడుగులు పడ్డాయి.

ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన పాలకులే ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని అనడానికి వారి ఆహ్వాన పత్రికే సాక్ష్యం. ఆలయనిర్మానానికి స్థానికులు వ్యతిరేకం కానప్పటికీ ప్రభుత్వ భూమిని కాపాడవలసిన ప్రజాప్రతినిధులు ఆలయ నిర్మాణాలకు స్థలం కేటాయించడం, నిర్మాణదారులు ఎమ్మెల్యే పేరున ఆహ్వాన పత్రిక ముద్రించి ప్రజలకు ఆహ్వానం తెలియజేయడం వింత పోకడకు దారితీసింది. శనివారం ఉదయం ఆలయ నిర్మాణ పనులను సచివాలయం 6 ప్లానింగ్ కార్యదర్శి అడ్డుకున్నప్పటికీ చీకటి పడిన తర్వాత ఆదివారం జరిగే ఆలయ శంకుస్థాపన పనులు చేపట్టారు.వరుస సెలవులు కావడంతో పక్కా ప్రణాళికతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టారని,నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలంలో ఆలయ పనులను అడ్డుకోవలసిన అధికారులకు పాలకులు అడ్డు తగలడం సమంజసం కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సుమారు 15 ఏళ్లగా ఆలయ నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ స్థలంలో అదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి పశువులపాక నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాడు,అదే ప్రాంతంలో ఆలయ నిర్మాణం చేపట్టడంపై సుమారు 15 ఏళ్లగా నివసిస్తున్న అతనిని తొలగించమనడం అదే ప్రాంతంలో ఆలయ నిర్మాణం చేపట్టడం పలు విమర్శలకు దారితీస్తున్నాయి.

అప్రాంతంలో గతంలో పలు ఆలయాలు మసీదు క్రిస్టియన్ కమ్యూనిటీ భవనాలు ఉన్నాయి. అత్యంత ఖరీదు గల ప్రాంతంలో ఆలయాల పేరిట ప్రభుత్వ స్థలాలు ఆక్రములకు జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడవలసిన అధికారులు ప్రజాప్రతినిధులు ఆలయాలకు భూములను కట్ట పెట్టడం సరికాదని స్థానిక ఎన్నికలు సమీపించడంతో ఓటు బ్యాంకు రాజకీయాలకు ఆలయాలు తెరపైకి వచ్చాయని దానికి స్థానిక ఎమ్మెల్యే వంతపాటడం సరికాదని,ఇప్పటికే ఆ ప్రాంతంలో అనేక ఆలయాలు నిర్మాణాలు చేపట్టి స్థానిక ఎమ్మెల్యే పేరును వాడుకుంటున్న వాటిని ఆయన ఖండించకపోగా స్థానిక ఎమ్మెల్యే పేరుతో ఆలయ శంకుస్థాపన ఆహ్వాన పత్రిక ప్రచురించడం విమర్శలకు దారితీస్తున్నాయి, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అధికారకంగా ప్రభుత్వ స్థలాలను ఆలయ నిర్మాణానికి కేటాయించినట్లయితే పరవాలేదు కానీ ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకపోవడం నిర్మాణాన్ని అడ్డుకున్న ప్లానింగ్ కార్యదర్శి ఆదేశాలు పట్టనట్టు వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని, పాలకులే అధికారుల అధికారాలనును తుంగలో తొక్కడం సరికాదని ఇటు అధికారులకు చెప్పలేక ప్రజా ప్రతినిధులు మాటవినలేక అయోమయ పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణాలకు తామేమి అడ్డు కాదని ప్రజల అవసరాల మేరకు ఉపయోగించవలసిన ఖరీదైన భూములను కాపాడవలసిన అధికారులు ప్రజా ప్రతినిధులు వారి అధికారులకు వారే అడ్డు తగలడం సరికాదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ఘనంగా శ్రీనుబాబునగర్‌లో దోబీఘాట్ శంకుస్థాపన కార్యక్రమం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** శనివారం ఉదయం శ్రీనుబాబునగర్ రజక కాలనీలో దోబీఘాట్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ గణబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టబడింది.సుమారు రూ.19.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ దోబీఘాట్ ప్రాంతీయ రజక సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ దాడి రమేష్ నాయుడు, వార్డ్ ప్రెసిడెంట్ కంపర ఆనంద్ మూర్తి పట్నాయక్, సత్తిరాజు, మంగలక్ష్మి, వెంకటేష్, శంకర్, సురేష్ తదితర సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రజక సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని, ఈ దోబీఘాట్ నిర్మాణం పూర్తయిన తరువాత స్థానికులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహాత్మా పూలే జయంతి విశాఖలోనివాళులు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** మహాత్మా జయంతిని పురస్కరించుకుని విశాఖపట్నంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శనివారం ఉదయం నగరంలోని న్యూ కోర్టు కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా పూలే విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా పూలే చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమాన త్వం, విద్యా ప్రాధాన్యతపై ఆయన చూపిన దారిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్ పీఎస్ నాయుడు పాల్గొని మహాత్మా పూలేకు నివాళులు అర్పించారు. కార్యక్రమం ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించబడింది.



# బోరుభద్ర లో బంగారం తో ఉడా యించిన వ్యాపారి






- రూ. కోటి కి పైగా ఉంటుందని అంచనా
- లబోదిబో మంటున్న భాదితులు

**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 11 :** ప్రజల నమ్మకాన్ని ఆసరా గా చేసుకొని కోటి రూపాయలు పైగా నగదు, బంగారం పట్టుకొని ఓ వ్యాపారి ఉడాయిశీచిన సంఘటన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం లోని బోరుభద్ర లో చోటుచేసుకుంది. వివరాలలోకి వెలితే సంతబొమ్మాలి మండలం బోరుభద్ర లో పోలాకి మండలం పిన్నిశీటిపేటకు చెందిన పొట్నూరు కృషా రావు 30 ఏళ్ల క్రితం వెశీకట భగవాన్ పేరు తో మెడికల్ షాప్ పెట్టి నడుపుతున్నాడు. మెడికల్ షాప్ లో మందులు అమ్ముతూ, చాలా కాలం నుండి వడ్డీకి డబ్బులు అప్పులు ఇస్తుండేవాడు. అలాగే బంగారం వస్తువులు తనఖా గా ఉంచుకుని డబ్బులు ఇచ్చే వ్యాపారానికి కూడా ప్రారంభించాడు. అయితే గత కొన్నేళ్లుగా తన మరదలు కుమారుడైన పొట్నూరు నాని ని బోరుభద్ర తీసుకు వచ్చి మెడికల్ షాప్ వ్యాపారం అప్పగించాడు. కృష్ణారావు మకాశీ నరసన్నపేట కు మార్చి అక్కడ వేరే వ్యాపారాలు చేస్తూ అప్పుడుడప్పుడు బోరుభద్ర వచ్చి షాప్ లెక్కలు చూసి వెళ్లేవాడు. కృష్ణారావు తాలూకా బంగారం తనఖా వ్యాపారాన్ని నాని అప్పటి నుండి కొనసాగిస్తూ అందరితో నమ్మకంగా మెలిగేవాడు. అయితే గత కొద్దీ రోజులుగా బంగారం వస్తువులు తనఖా పెట్టిన వారు డబ్బులు తీసుకువచ్చి తమ బంగారం వస్తువులు ఇవ్వమని అడగగా వేరేవారి వద్ద ఉన్నాయని తిప్పుతున్నాడు మరి .కొంతమంది వద్ద డబ్బులు తీసుకొని నెలల నెలలు కావాస్తున్నా బంగారం తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడం తో భాదితులు పిట్ట చిన్నమి,నల్ల కామమ్మ, లండ వరలక్ష్మి, లండ చిన్నమ్మి తదితరులు గట్టిగా నెలదీసారు. దీంతో మెడికల్ షాప్ కు తాళాలు వేసి గురువారం నుండి నానీ పరాయి అయ్యాడని గ్రామంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. నాని ఈ ప్రాంతం లో 30 లక్షలు రూపాయలు వరకు అప్పులు చేసాడని, కొందరు వద్ద నెలకి నూటికి పది రూపాయలు వరకు వడ్డీకి అప్పులు వాడినట్లు తెలిసింది. డబ్బులు తో పాటు తనఖా పెట్టిన 50 తులాల బంగారం వస్తువులతో మెడికల్ షాప్ మూసి పరాయి కావడం తో భాదితులు లబోదిబో మంటున్నారు. చేసేది లేక బాధితులంతా లబోదిబో అంటూ సంతబొమ్మాలి పోలీస్ స్టేషన్ కి వెళ్లి మొరపెట్టుకున్నారు. మోసపోయిన వారిలో బోరుభద్ర, గొదలాం. మలగాం, పాలతలగాం, శిమ్మయ్యపేట, కొల్లిపాడు, గెద్దలపాడు, పిట్టవానిపేట, పాత మేఘవరం బాదితులు ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఎప్పుడు ఇటువంటి సంఘటన జరగక పోవడంతో ఎక్కడ చూసిన బంగారం తో ఉడాయించిన వ్యాపారి ఉదశీతమే చర్చించుకుంటున్నారు.

## చీపురుపల్లి నియోజకవర్గ ప్రజా దర్బార్‌లో పాల్గొన్న యువ నాయకులు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 11.** చీపురుపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యువ నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతులను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలను ఓపికగా విన్న రామ్ మల్లిక్ నాయుడు , సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే పరిష్కరించగలిగే సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. మిగిలిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చొరవ చూపుతానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, కార్యకర్తలు మరియు నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పైలా బలరాం , చీపురుపల్లి ఏఎంసీ చైర్మన్ రేగాన రామారావు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జి పదోన్నతి లో చీపురుపల్లి వాసి..



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 11.** రాష్ట్రంలో వివిధ కోర్టులలో సివిల్ జడ్జ్ సీనియర్ డివిజనల్ గా పనిచేస్తున్న 15 మందికి జిల్లా సెషన్స్ జడ్జీలుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు చీపురుపల్లికి చెందిన బంకపల్లి నిర్మల జిల్లా సెషన్స్ జడ్జిగా పదోన్నతి లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జడ్జిగా పనిచేస్తున్న ఈమె చీపురుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకొని అనంతరం ఇంటర్ డిగ్రీ పూర్తి చేసి లా కోర్స్ కూడా చదివారు. తండ్రి బ్యాంకు ఉద్యోగిగా , తల్లి ఉపాధ్యాయునిగా పనిచేశారు, భర్త సురేష్ కూడా సహకారంతో చీపురుపల్లి కి చెందిన బంకపల్లి నిర్మల జిల్లా జడ్జిగా నియామకం కావడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. న్యాయవాదిగా కోర్సు పూర్తి అనంతరం మొదటి ప్రయత్నంలోనే జడ్జీల నియామకంలో ఎంపిక కావడంతోపాటు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి లో మొదటిసారిగా మేజిస్ట్రేట్ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పలు జిల్లాలు మేజిస్ట్రేట్గా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం జిల్లా జడ్జి నియమకాల్లో చీపురుపల్లి కి చెందిన బంకపల్లి నిర్మల పదోన్నతి పొందడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## .జర్రెల కొత్తూరులో వైభవంగా నంది పండుగ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్తవీధి మండలం జర్రెల పంచాయితీ పరిధిలోని జర్రెల కొత్తూరు గ్రామంలో నంది పండుగను గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని పాటిస్తూ వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు నిర్వహించటం విశేషం. సోమవారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం భక్తి గీతాలు, దప్పుల దరువులు, ఆటపాటలతో పాలికేల ఊరేగింపులు ఘనంగా సాగాయి. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. గురువారం ఉదయం ప్రత్యేకంగా చేటలు పట్టి పుట్టకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. శుక్రవారం సాయంత్రం ఇంటింటా పాలికేల ఊరేగింపుతో పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయబద్ధంగా ‘దొంగ--పోలీసు’ ఆటలను గ్రామస్థులు ఉత్సాహంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా నకిలీ కర్ర వస్తువులతో తుపాకులు, కత్తులు, గొడ్డళ్ళు, బాణాలు వంటి పాత్రలను వినియోగిస్తూ పూర్వీకుల సంప్రదాయాన్ని ప్రతిబింబించారు. ఈ వారం రోజుల పాటు పాండవుల చరిత్ర, ఏడుగురు అక్కచెల్లెల కథలు, గన్నికల చరిత్రకు సంబంధించిన పాటలను భక్తిపూర్వకంగా ఆలపిస్తూ ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామం ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని కోరుతూ నంది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి సమక్షంలో గిరిజనులు ఉత్సాహంగా నిర్వహించారు.

# గ్రీష్మ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక రైళ్లు




**ప్రయాణికులకు రైల్వే శుభవార్త**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** ప్రజల ప్రయాణ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రీష్మ కాలంలో అదనపు రద్దీని తగ్గించేందుకు భారతీయ రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు రెండు ముఖ్య మార్గాల్లో సమ్మర్ స్పెషల్ ఎక్స్ ప్రెస్ రైళ్లు ప్రకటించింది.

చర్లపల్లి శాంత్రగాచి మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్లు

ట్రైన్ నెంబర్. 07517 చర్లపల్లి,శాంత్రగాచి సమ్మ ర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 15, 19, 23 తేదీలలో బుధ, ఆదివారం, గురువారం ఉద యం 10: 30 గంటలకు చర్లపల్లి నుంచి బయ లుదేరి అదే రోజు రాత్రి 10:48కి దువ్వాడ చేరు తుంది. అక్క డి నుంచి విజియానగరం, శ్రీకాకు ళం రోడ్ మీదు గా మరుసటి రోజు మధ్యాహ్నం 2:30కి శాంత్ర గాచి చేరుతుంది. మొత్తం మూ డు ట్రిప్పులు నిర్వహించబడతాయి. రిటర్న్ దిశ లో ట్రైన్ నెంబర్. 07518 శాంత్రగాచి,చర్లపల్లి రైలు ఏప్రిల్ 16, 20, 24 తేదీలలో గురువారం, సోమవారం, శుక్రవారం సాయంత్రం 4:45కి బయలుదేరి తదుపరి రోజు ఉదయం శ్రీకాకుళం రోడ్, విజియానగరం, దువ్వాడ మీదుగా రాత్రి 10:00కి చర్లపల్లి చేరుతుంది.

ఈ రైళ్లలో మొత్తం 24 బోగీలు ఉంటాయి. ఫస్ట్ ఎ సి, సెకండ్ ఎ సి, థర్డ్ ఎ సి, స్లీపర్, జనరల్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. మైసూరు న్యూ జల్పాయిగురి మధ్య ప్రత్యేక రైళ్లు ట్రైన్ నెంబర్.. 06251 మైసూరు న్యూ జల్పాయిగురి సమ్మర్ స్పెషల్ రైలు ఏప్రిల్ 17, 24 తేదీలలో శుక్రవారం సాయంత్రం 4:40కి బయలుదేరి, శనివారం మధ్యాహ్నం కొట్టవలస, విజియానగ రం, శ్రీకాకుళం రోడ్ మీదుగా ప్రయాణించి ఆది వారం సాయంత్రం 5:30కి గమ్యస్థానానికి చేరు తుంది. మొత్తం రెండు ట్రిప్పులు ఉంటాయి.

రిటర్న్ దిశలో ట్రైన్ నెంబర్. 06252 న్యూ జల్పాయిగురి--మైసూరు రైలు ఏప్రిల్ 20, 27 తేదీలలో సోమవారం సాయంత్రం 4:45కి బయ లుదేరి మంగళవారం శ్రీకాకుళం రోడ్, విజియాన గరం, కొట్టవలస మీదుగా బుధవారం సాయం త్రం 4:00కి మైసూరు చేరుతుంది.

ఈ రైళ్లలో మొత్తం 20 బోగీలు ఉంటాయి. వీటి లో ఎ.సి, స్లీపర్, జనరల్ కోచ్‌లతో పాటు విక లాంగుల కోసం ప్రత్యేక బోగీలు కూడా ఉంటా యి.ప్రధాన నిలుపుదల స్టేషన్లు

ఈ రెండు రూట్లలో దువ్వాడ, విజియానగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ వంటి ముఖ్య స్టేషన్ల లో రైళ్లు ఆగనున్నాయి.గ్రీష్మ కాలంలో ప్రయాణి కుల రద్దీ ఎక్కువగా ఉండే నేపథ్యంలో ఈ ప్రత్యే క రైళ్లు ప్రయాణికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. ముం దస్తుగా టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

## పొర్లుబందలో వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ వంపూరు గంగులయ్య



**చింతపల్లి/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయితీ పరిధిలోని పొర్లుబంద గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు రాష్ట్ర జానపద కళలు, సాంస్కృతిక సృజనాత్మక అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ వుంపూరి గంగులయ్య శనివారం హాజరయ్యారు. వంతల వారి ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన గంగులయ్యకు గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నవదంపతులు జశ్వంత్, మేరీలను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం ఆనందం, ఐశ్వర్యం, సుఖశాంతులతో నిండిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గొర్లె వీర వెంకట్, మాజీ ఎంపీపీ చింతపల్లి వంతల బాబురావు, జి. మాడుగుల పిఎసిఎస్ చైర్మన్ త్రిమూర్తులు,పెదబరడ పంచాయతీ అధ్యక్షులు కూడ రామకృష్ణ నాయకులు సూర్ల వీరేంద్ర కుమార్, మసాడి భీమన్న, చిన్ని రాజుబాబు,మొట్టడం బాలరాజు,పోటుకూరి జయరాజు, గాజుల శ్రీను, వాసుపరి ప్రసాద్,కృష్ణ వంశీ (పెదవలస మాజీ సర్పంచ్) అలాగే జాగరపు బాలు, కొయ్యం ఇమ్మానుయేల్,గబులంగి గణేష్, సాగిన బ్రాహ్మజీ పాడల్, మజ్జి సంతోష్, మజ్జి సత్యనారాయణ, వాడేలా కృష్ణతో పాటు యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నవదంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాడేరు, చింతపల్లి, జీకే వీధి ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామ పెద్దలు, స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వివాహ వేడుకను సాంప్రదాయబద్ధంగా, ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.



## ఒకేషనల్ కోర్స్ ల తోనే ఉపాధి అవకాశాలు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 11 :** ఒకేషనల్ కోర్స్ ల తోనే ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు త్వరితగతిన లభిస్తాయని సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి . బాబురావు తెలిపారు. సంతబొమ్మాలి మండల పరిధిలోని పాఠశాలలలో పదవ తరగతిలో ఒకేషనల్ కోర్సులో ఎలక్ట్రికల్ అండ్ హార్డువేర్ విభాగాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సమ్మర్ ఇంటర్న్ షిప్ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంతబొమ్మాళి పరిసర ప్రాంతంలో గల మొబైల్ అండ్ ఎలక్ట్రికల్, రీవైండింగ్, రిపేరింగ్ షాప్స్ వద్దకు విద్యార్థులను శు క్రవారం తీసుకొని వెళ్లి ఆయా విభాగాల్లో ఎలక్ట్రానిక్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు మార్పు లచ్చుశీ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మహిళా సాధికారతతోనే మహాత్మా పూలేకు నిజమైన నివాళి



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 11 :** సామాజిక సమానత్వం కోసం పరితపించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు విద్యావంతులు కావాలని మండల తెలుగుదేశం నేతలు పిలుపునిచ్చారు. కోటబొమ్మాలి మండల కేంద్రం లోని ఎన్టీఆర్ భవనంలో శనివారం నిర్వహించిన పూలే 199 జయంతి వేడుకల్లో పూలే చిత్రపటానికి టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నాడు సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి, ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది దేశంలోనే తొలి బాలికల పాఠశాలను స్థాపించిన ఘనత పూలే దంపతులకే దక్కుతుందని కొనియాడారు. సభలో మహిళల భాగస్వామ్యం అధికంగా ఉండటం శుభపరిణామమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అద్యక్షుడు బోయిన రమేష్, మండల పార్టీ అద్యక్షుడు బోయిన సత్య శ్రీనివాస్, దేశం నేతలు తర్ర రామక్రిష్ణ, కర్రి అప్పారావు, పాగోటి ముత్తురాజు, మక్క లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాస్, పట్ట సింహాచలం, కోరాడ గోవింద్, లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆదిత్య వర్మ.



**పాడేరు, పెన్ పవర్,ఏప్రిల్ 11:**ఐటిడిఏ (గిరిజన సంక్షేమ శాఖ) నూతన ప్రాజెక్ట్ అధికారిగా ఆదిత్య వర్మ శనివారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శ్రీమతి తిరుమాని శ్రీపూజ వారి నుండి అధికారకంగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీ మోదకొండ మా అమ్మ వారి ని కుటుంబ సమేతంగా దర్శనం చుకున్న వారికి అమ్మ వారి ఆశీస్సులు పసుపు కుంకుమ అక్షింతలతో ఆశీర్వదించిన ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి. అనంతరం నేరుగా ఐటిడిఐ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయ పరిపాలనాధికారి హేమలత పుష్పగుచ్చం ఇచ్చి సిబ్బందితో ఆయనకు ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ వారికి

కార్యాలయంలో వివిధ సెక్షన్లకు చెందిన అధికారులు సిబ్బంది పూల బొకేలతో పరిచయ కార్యక్రమం చేసుకున్నారు. ఆయన గిరిజన ప్రాంతంలో పంచడం గొప్ప వరమని, అధికారులకు సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి నిరుపేద కుటుంబం ఇంటికీ చేరేలా చూస్తానని హామీ ఇచ్చారు. అందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకొని వారితో కలిసి పని చేద్దామని తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుపరిచేందుకు , అలాగే మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన విద్య,వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు.


ఉపాధి అవకాశాలు గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణలు ఇప్పించి , వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు అందించడంలో అన్ని శాఖల సమన్వయం అవసరమని, నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యాలయ పనితీరులో పారదర్శకత పాటిస్తూ, గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగాతెలుసుకుంటానని

ఆదిత్య వర్మ, ప్రాజెక్ట్ అధికారి తెలియజేశారు.

?ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి హేమలత, ఎకౌంటు ఆఫీసర్ శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్ఎఫ్ఓ కళ్యాణి, వివిధ విభాగాల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## మెడికల్ విద్యార్థుల రక్తదానం... స్ఫూర్తిదాయకం..



**పాడేరు, పెన్ పవర్,ఏప్రిల్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో గల వైద్య కళాశాల ఆవరణంలో శనివారం వైద్య విద్యార్థులు రక్తదానం చేసి వారి స్ఫూర్తిని చాటుకున్నారు.

జిల్లాలోని రక్తపు నిలువలు పెంచేందుకు అత్యవసర పరిస్థితిలో ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు వైద్య విద్యార్థులు రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమని పలువురు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమానికి వైద్య కళాశాల ప్రధాన చార్యులు డాక్టర్ పి వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ జిజిహెచ్ లో రక్తపు నిలువలు తగ్గడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్య కళాశాల ప్రధాన చార్యులతో సంప్రదించి ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని అన్నారు.

ఈ రక్తదాన శిబిరం నిర్వహించుకునేందుకు ప్రధానచార్యులు ఎంతగానో సహకారం అందించాలని మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేస్తున్నారని అన్నారు.

రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ఒక అలవాటుగా తీసుకొని ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తపు నిలువలు పెంచేందుకు కృషి చేస్తుందని అన్ని శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని అన్నారు.

అన్ని రకాల వైద్య పరీక్షలు చేసిన తర్వాతే పరిమితికి మించి రక్తం ఉంటేనే తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, కోశాధికారి సూర్యారావు,కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నాయుడు,రవి, శ్రీనివాస్,జయలక్ష్మి జిల్లా కోఆర్డినేటర్ పూర్ణ సిబ్బంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ ఎస్సీ ,ఎస్టీ యోజన పథకం బహుళ ప్రయోజనకారి





**-విశాఖ జిల్లా లో ప్రథమం గా గాజువాక నియోజకవర్గం లో ప్రారంభించడం సంతోషకరం - పల్లా**


**గాజువాక పెన్ పవర్ ,ఏప్రిల్ 11**

మహా విశాఖ నగర పాలక సంస్థ 75వ వార్డ్, పెద గంట్యాడ మండలం, చిన కోరాడ ఎస్సి కాలనీ లో ప్రధానమంత్రి సూర్య ఘర్ఎస్సి ,ఎస్టీ యోజన పథకం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెదపూడి అప్పలస్వామి, సుధ దంపతుల ఇంటి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం చాలా ఉపయోగకరం అని, దీనిని అందరూ వినియోగించుకోవాలని , ప్రస్తుతం 200 యూనిట్లు వరకు ఉచితంగా అందిస్తున్నారని, సుమారు ఈ మండలంలో 350 మంది లబ్ధిదారులు కు ఈ పథకం కు అర్హులుగా ఉన్నారని, త్వరలో అందరికీ అందించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, 75వ వార్డ్ మాజీ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి రమణ, ఏపిఈపీడీసీఎల్ అధికారులు ఎస్ఈ శ్యామ్ బాబు ,డిఈఈ , ఏడిఈ , పెద గంట్యాడ ఏ ఈ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మరియు గాజువాక నియోజకవర్గం ఎస్సి సెల్ అధ్యక్షుడు వంగలపూడి అప్పలరాజు, 75వ వార్డ్ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, బిజెపి అధ్యక్షుడు కిల్లాని ముసలయ్య , క్లస్టర్ ఇంచార్జ్ ఉరుకూటి అప్పలరాజు, పెద్దాడ సోము నాయుడు, టేకేటీ అప్పారావు, వర లక్ష్మి, జనసేన జ్యోతి రెడ్డి, కణితి సన్యాసమ్మ, పెద్దాడ సరోజిని, సిముసిరి శ్రీను, ఊరుకూటి అప్పారావు, ముదుర్తి సాంబ, నక్క గంగరాజు, కడవల రమణ, నమ్మి పుష్పలత, అందిబోయిన రామునాయుడు, చౌదరి, మొల్లి అప్పలనాయుడు, టేకేటీ అప్పలరాజు, మొల్లి రమణ, మొల్లి సోమునాయుడు, చిన కోరాడ ఎస్సి కాలనీ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గరుడాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేసవి కాల ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు





**గాజువాక:పెన్ పవర్ ,ఏప్రిల్ 11**

జీవీఎంసీ పరిధి 65వ వార్డు భానోజీ తోట వాంబే కోలనీ గరుడాద్రి కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో అంగరంగ వైభవంగా ప్రతి వారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ వేసవికాలం ఆధ్యాత్మిక శిక్షణ తరగతులను పరిశీలించడానికి బిజెపి స్టేట్ కో కన్వీనర్ హిందూ ధర్మ రక్షణ సెల్ విజయ శంకర్ ఫణీంద్ర విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి శిక్షణ తరగతులు విద్యార్థులు ఆధ్యాత్మిక ప్రవచనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణ తరగతులు 45రోజులు పాటు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నేర్పడం జరుగుతుందని తెలిపారు. స్వామివారిని ఏడు వారాలు నిష్టతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి ప్రదర్శలు చేసి స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం. ప్రతి శనివారం లాభాల దుర్గాప్రసాద్ భవాని బృందముచే అన్నమాచార్య కీర్తనలు జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ.రాజేశ్వరి మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు,విజయ నాయక్ ,పెంటకోట రాజు, మిట్టనీ లక్ష్మి,పూడి శాంతి, తిప్పల స్వాతి, పప్పల ఆదిలక్ష్మి, ఉషరాణి,నాగమణి,స్వాతి,పద్మ,చిట్టెమ్మ,హిమజ,సావిత్రమ్మ, జీవన్ జ్యోతి మరియు ఆలయ సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా జాయింట్ కలెక్టర్గాపదవి బాధ్యతలు స్వీకరించిన తిరుమాని శ్రీపూజ.



**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 11:**ఏ ఎస్ ఆర్ జిల్లా (పాడేరు)జిల్లా నూతన జాయింట్ కలెక్టర్గా తిరుమాని శ్రీపూజ శనివారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఐఏఎస్ అధికారులను ప్రమోషన్లపై బదిలీల్లో భాగంగా ఆమెను ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఉన్న వారికి ఈ జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా కేటాయించిన నియమించిన సంగతి తెలిసిందే.

జాయింట్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.నీలకంఠరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రసాద్ రావు, కలెక్టరేట్ సూపర్ ఇంటెండెంట్ లక్ష్మణరావు , కలెక్టరేట్ సిబ్బంది ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఆమె పదవి బాధ్యతలు చేపట్టే ముందు కుటుంబ సమేతంగా శ్రీ మోదకొండ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న వారికి అమ్మవారి పసుపు కుంకుమ తో పాటు అమ్మవారి అక్షింతలతో ఆలయాన ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యాచర్యలు వారికి అక్షింతలతో ఆశీర్వదించారు. అమ్మవారి టెంపుల్ నుండి నేరుగా ఐటిడిఏ కార్యాలయానికి చేరుకొని అక్కడ పిఓ బాధ్యతలను నూతనంగా జాయిన్ అవుతున్న ఆదిత్య వర్మంగా వారికి అప్పగించి అక్కడనుండి కలెక్టరేట్ చేరుకొని జాయింట్ కలెక్టర్ బాధ్యతలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ గతంలో మైటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా జిల్లా ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ పదవులు నిర్వహించి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే తనకు ఎక్కువ ప్రాధాన్యత పెరిగిందని ఆమె స్పష్టం చేశారు.

?ప్రజా సమస్యల పరిష్కారం, 'ప్రజావాణి' వంటి కార్యక్రమాల ద్వారా వచ్చే విన్నపాలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని,

? జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకెళ్తూ, జిల్లా అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ కు పుష్పగుచ్ఛం తో జిల్లా రెవెన్యూ అధికారి , కలెక్టరేట్ ఏవో, సమాచార శాఖ డివిజనల్ పౌర సంబంధాల అధికారి, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు అభివృద్ధిలో సహకార సంఘాలే కీలక పాత్ర పోషించాలి డి సి సి బి చైర్మన్ కిమిడి నాగార్జున...

**చీపురుపల్లి పెన్ పవర్, ఏప్రిల్ 11:** జిల్లాలో రైతులకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించడమే లక్ష్యమని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శనివారం శాతంవలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఎ సి ఎస్)ను ఆయన సందర్శించి అక్కడి కార్యకలాపాలను సమీక్షించారు.ఈ సందర్భంగా సంఘంలో రైతులకు అందుతున్న పంట రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా విధానం, రికవరీ పరిస్థితులు వంటి అంశాలను, గోదాం ను పరిశీలించారు. గోదాము వినియోగం , స్టాక్ రిజిస్టర్లు, లావాదేవీల నిర్వహణపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఉపయోగం లేని విధంగా గోదాంలను నిర్మించారు. ఇబ్బందులు లేకుండా సేవలు అందించాల్సిన బాధ్యత పీ ఎ సి ఎస్ లపై ఉందన్నారు. ప్రతి లావాదేవీ పారదర్శకంగా నమోదు చేయాలని,రికార్డులనుక్రమబద్ధంగానిర్వహించాలనిసూచించారు.గోదాముల్లోనిల్వలనుసక్రమంగా ఉంచి నాణ్యత పరిరక్షణకు ప్రాధాన్యతఇవ్వాలనితెలిపారు.అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి సన్యాసి నాయుడు, కొనిసి దాలి నాయుడు, అధికారులు లెంక గోపాల్ నాయుడు, పెన్మత్స సురేష్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆస్తి పాత ఇనుప అంగడిలో..

హుకుంపేట మండలంలో ప్రభుత్వ పాఠశాలలో భోజనం ప్లేట్ల వ్యవహారం డిస్పోజల్ కేంద్రంలో తూకం వేస్తున్న దృశ్యాలు వెలుగులోకి, విచారణకు డిమాండ్ చేస్తున్న గ్రామ ప్రజలు






**హుకుంపేట పెన్ పవర్ ఏప్రిల్ 11:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో గల హుకుంపేట మండలంలోని బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ప్లేట్లు పాత ఇనుప కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న దృశ్యాలు న్యూస్ టుడే కెమెరాలకు చిక్కాయ్ దింతో ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది పాఠశాల ప్రాంగణం నుంచి పట్టపగలే ఆటోలో ప్లేట్లను ఎక్కించి తీసుకెళ్లినట్లు ఓ ఆకాసరామ్మన్న సమాచారం ఇవ్వగా ఆ తర్వాత పాత సామాన్లు కొనుగోలు చేసే కేంద్రానికి చేరుకున్న కొందరు ప్లేట్లను బస్తాలలో వేసి తూకం వేస్తున్న సమయంలో తీసిన ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి ఈ పరిణామాల నేపథ్యంలో ఈ ప్లేట్లు అధికారిక విధానంలోనే డిస్పోజ్ చేయబడ్డాయా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి అందులో రెండో శనివారం సెలవు కావడంతో అనుమానం మరింత బలపడుతుంది. ప్రభుత్వ పథకాల కింద వినియోగించే సామగ్రిని తొలగించే ప్రక్రియలో నిబంధనలు పాటించాల్సి ఉండటంతో అవి అమలు అయ్యాయా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి స్థానికులు ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు ఇదిలా ఉండగా ఈ విషయంపై సంబంధిత ఏటిడబ్ల్యూఓ ను వివరణ కోసం ఫోన్ ద్వారా సంప్రదించగా ఆమే అందుబాటులోకి రాలేదు అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## టిడిపి కార్యాలయం లో జ్యోతిరావు పులే కి ఘన నివాళ్ళులర్పించిన :పల్లా





**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 11** మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పల్లా శ్రీనివాసరావు పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిలోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం జ్యోతి రావు పూలె ఎంతగానో కృషి చేశారని తెలిపారు. నేటి యువత మహాత్మా జ్యోతిరావు పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన డైరెక్టర్లు గుర్రం నూకరాజు, అంగ కృష్ణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిరె శివప్రసాద్ మహిళా అధ్యక్షురాలు కనక భవాని , టిఎన్టియుసి అధ్యక్షుడు అంజిబాబు, నియోజకవర్గ నాయకులు కర్రీ దర్శింద్ర, రట్టి వాసు, తిరుపతిరావు, అప్పలరాజు, బైపల్లి గాంధీ, జగదీష్, అలమండరాజు, చెరుకూరి నాగేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పులే ను మననం చేసుకున్న స్టీల్ టి ఎన్ టి యు సి



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,ఏప్రిల్ 11** స్టీల్ ప్లాంట్ ఒబిసి అసోసిషయన్ ఆహ్వానం మేరకు జ్యోతిరావు పూలే 199 జయంతి పురస్కరించికొని ఆయన విగ్రహంనుకు పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు . ఈ కార్యక్రమం లో ఓబీసీ సంఘం అధ్యక్షుడు బి అప్పారావు , ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనువాసరావు మరియు కార్యవర్గ సభ్యులు ఎన్ రాజు స్టీల్ టి ఎన్ టి యు సి నాయుకులు పంచదార్ల పెంటారావు , వై అప్పలరాజు , ఎం చిరంజీవి , ఎస్ చంద్రశేఖర్ , పుల్లారావు , తదితరులు నాయుకులు పాల్గొని నివాళులు అర్పించారు.

## మాజీ సర్పంచ్ దంపతులకు ఎంపీటీసీ సన్మానం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీకి చెందిన తాజా మాజీ సర్పంచ్ వనపల కాసులమ్మ, వైఎస్సార్సీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వనపల రాజేష్ దంపతులను వంచుల పంచాయతీ ఎంపీటీసీ జోరంగి సరస్వతి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా దుశాలువ కప్పి వారి సేవలను కొనియాడారు. పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్, ఎంపీటీసీ సమన్వయంతో కృషి చేయడం వల్ల గ్రామానికి ప్రయోజనం చేకూరిందని సన్మానం అందుకోవడం ఆనందంగా ఉందని, పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగినట్లు వనపల రాజేష్ పేర్కొన్నారు.

## అనకాపల్లిలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

- సమాజానికి స్ఫూర్తిదాయకమైన పూలే ఆశయాలు
- పోలీసు అధికారుల ఘన నివాళులు




**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** సామాజిక సమానత్వం, విద్యా విప్లవానికి పునాది వేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను అనకాపల్లి జిల్లా పోలీసులు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం గౌరవప్రదంగా సాగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి మాట్లాడుతూ

భారతదేశంలో అక్షరాస్యతకు, ముఖ్యంగా మహిళా విద్యకు బాటలు వేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే. కులవివక్షలేని సమాజం కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ ఆదర్శప్రాయమే" అని పేర్కొన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా బలహీన వర్గాలు, మహిళల భద్రతకు అనకాపల్లి జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన ఆయన మార్గంలో నేటి యువత ముందుకు సాగాలి" అని సూచించారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి రూరల్ సిఐ జి. అశోక్ కుమార్, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనా సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. పూలే స్ఫూర్తితో ప్రజా సేవలో మరింత కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## పద్మనాభం మండలంలో జనాభా లెక్కలు

- తొలి విడత శిక్షణ విజయవంతం



**పద్మనాభం, పెన్ పవర్, ఏప్రిల్ 11 :**పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జనాభా లెక్కల సెన్సస్ తొలి విడ త శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 9వ తేదీన ప్రారంభ మై, శనివారం విజయవంతంగా ముగిసింది.

ఈ కార్యక్రమానికి జిల్లా సెన్సస్ ఇన్‌చార్జీలు త్రినాథ్ రావు, హరీష్ పాథక్, పిల్లా రేవతి హాజరై శిక్షణార్థులకు కీలక సూచనలు, మార్గదర్శకాలు అందించారు. శిక్షణా అధికారులుగా ఎల్. అ ప్పారావు, కె. గణేష్ పాల్గొని, ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లకు కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా జనాభా లెక్కల సేకరణ విధానం, డేటా నమోదు పద్ధతులు, అప్లికేషన్ వినియోగంపై వివరంగా తెలియజేశారు. తదుపరి దశకు సన్నద్ధం చేయ డానికి కొంతమంది ఇళ్లను ఎంపిక చేసి, ట్రైనింగ్ అప్లికేషన్ ద్వారా ప్రత్యక్షంగా డేటా నమోదు ప్రాక్టీస్ కూడా నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్ర మం ద్వారా సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఏర్పడటంతో, రాబోయే జనాభా లెక్కల ప్రక్రియ ను సమర్థవంతంగా నిర్వహించగలమనే విశ్వాసాన్ని అధికారులు వ్యక్తం చేశారు

## భక్తి శ్రద్ధలతో శ్రీశ్రీశ్రీ బాల వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట,హోమం...



**నాతవరం, పెన్ పవర్ (ఏప్రిల్ 11):** నాతవరం బీసీ కాలనీలో శ్రీబాలవరసిద్ధి వినాయక ఆలయ ప్రారంభ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రతిష్ఠ విగ్రహాన్ని శోభయాత్రగా గ్రామంలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ట వాస్తు హోమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం 8.38 గంటలకు దేవాలయ ప్రారంభం, ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరగనుందని తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధనకార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సై వై.తారకేశ్వరరావు ఈ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు .

## విశాఖ పశ్చిమలో రాజకీయ చైతన్యం



- మంత్రుల హాజరుతో కార్యక్రమానికి ప్రాధాన్యం
- మంత్రులను టిడిపి కార్యాలయానికి ఘన స్వాగతం ఎమ్మెల్యే

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ రాజకీయాల్లో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. గోపాలపట్నంలోని నియోజకవర్గ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు దోలా బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డికి, టీడీపీ యువనేత మౌర్య సింహ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వ విప్ గణబాబు కుటుంబానికి చెందిన మౌర్య సింహ ముందుండి మంత్రులను ఆహ్వానించడం పార్టీ లోపల యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే సంకేతంగా భావించబడుతోంది. ఇది భవిష్యత్తులో వారసత్వ రాజకీయాలకు బాటలు వేస్తూ, కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడంలో కీలకంగా మారవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీ కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పలనరసింహం విగ్రహానికి మంత్రులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ చర్య ద్వారా పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకుల పట్ల గౌరవాన్ని చాటడంతో పాటు, కేడర్‌లో భావోద్వేగ అనుబంధాన్ని పెంపొందించే ప్రయత్నంగా ఇది నిలిచింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు హాజరయ్యారు. కూటమి నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనడం ద్వారా ఇది సాధారణ స్వాగత కార్యక్రమాన్ని మించి, విస్తృత స్థాయి రాజకీయ సమన్వయ సమావేశంగా మారింది.

భవిష్యత్తు ఎన్నికల దిశగా కేడర్ సన్నద్ధం

ఈ కార్యక్రమం ద్వారా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ శక్తి ప్రదర్శనతో పాటు, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేడర్‌ను ఒక తాటిపైకి తీసుకురావడం, సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి లక్ష్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మంత్రుల హాజరు ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి ప్రాధాన్యతను తీసుకువచ్చింది. రాజకీయ పరిణామాలకు సంకేతం మొత్తంగా ఈ కార్యక్రమం విశాఖ పశ్చిమలో రాజకీయ చైతన్యాన్ని ప్రతిబింబిస్తూ, యువ నాయకత్వాన్ని ముందుకు తేవడం, సీనియర్ నేతల వారసత్వాన్ని గౌరవించడం, పార్టీ ఐక్యతను బలోపేతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలను సాధించింది. ఇది రాబోయే రాజకీయ పరిణామాలకు సూచనగా భావించవచ్చు.

## చింతపల్లి నియోజకవర్గం పునరుద్ధరణ అత్యవసరం

- స్థానికులు, నేతల డిమాండ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 11:** చింతపల్లి నియోజకవర్గం పునరుద్ధరణ అత్యవసరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వనపల రాజేష్ పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో వంచుల పంచాయతీ ఎల్లవరం కట్టు వీధిలో స్థానిక ప్రజలతో కలిసి చింతపల్లి నియోజకవర్గం అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వనపల రాజేష్ మాట్లాడుతూ, పరిపాలనా సౌలభ్యం కోసం చింతపల్లి నియోజకవర్గాన్ని తిరిగి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గతంలో చింతపల్లి నియోజకవర్గం ఉన్నప్పటికీ, పునర్వ్యవస్థీకరణలో భాగంగా దాన్ని తొలగించి పాడేరు నియోజకవర్గంగా మార్చారని ఆయన గుర్తుచేశారు.దీని కారణంగా చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలు అభివృద్ధిలో వెనుకబడి పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి చింతపల్లి నియోజకవర్గాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో లొంజా గణపతి, పొత్తురు గంగరాజు, అరడ సత్తిబాబు, జానకి రామ్, పాంగి చిట్టిబాబు, కంకిపాటి శ్రీనివాస్, త్రినాధ్, చిలకమ్మ, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి -- మహాత్మా జ్యోతిబా పూలే



* ఘన నివాళులర్పించిన నివాళి ఎమ్మెల్యే గణబాబు పిలుపు
* పూలే ఆశయాలతో సమసమాజ నిర్మాణం


**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** సమాజంలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలను నిర్మూలిస్తూ అణగారిన వర్గాలకు వెలుగుదారి చూపిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమానికి పునాది వేసిన గొప్ప సంస్కర్త అని ఎమ్మెల్యే తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సైతం పూలేను తన ఆలోచనా గురువుగా భావించారని గుర్తుచేశారు. మహిళా సాధికారతకు మార్గదర్శి, స్త్రీ విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన పూలే, తన భార్య సావిత్రిబాయి పూలేను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు. 1848లో పూనాలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడం ఆయన గొప్ప సేవగా నిలిచింది.

బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన పూలే, వితంతువుల కోసం ఆశ్రమాలు స్థాపించారు. శిశుహత్యలను నివారించేందుకు "బాలహత్య ప్రధిబంధక్ గృహం"ను ప్రారంభించడం ఆయన మానవతా దృక్పథాన్ని ప్రతిబింబించింది.

ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం పూలే ఆశయాల సాధనలో ముందుకు సాగుతోందని గణబాబు తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు 33% రిజర్వేషన్ల కోసం తీర్మానం, బీసీ కుల గణనకు నిర్ణయం, నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.25వేలు, మత్స్యకారులకు నిషేధకాల సాయం రూ.20వేలు, బీసీ వసతి గృహాల అభివృద్ధి, ఐఏఎస్, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్,

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గణబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




## జనగణనకు శిక్షణ - తహసిల్దార్ అప్పారావు

* ఎన్యూయుమేటర్లకు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 11.**2027 జనాభా గణనకు సంబంధించి ఎన్యూమేటర్ల, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమం ఉంటుందని మండల తహసిల్దార్ భాస్కర అప్పారావు తెలిపారు. శనివారం తహసిల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గల ఎంపిడిఓ కార్యాలయంలో ఏప్రిల్ 13 నుంచి 22 వరకు జన గణనపై శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. స్వీయ గణనకు మే1 నుంచి ఎన్యూమేటర్లు, సూపర్వైజర్లు ఇంటింటికి వెళ్లి ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణనా చేపడతారన్నారు. ప్రజలు వివరాలు ఇస్తే చాలని, ఆధార్, పాన్ కార్డు తదితర వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. తొలి విడతలో ఇల్లు కుటుంబాల వివరాలు నమోదు చేస్తారని, ఈనెల 16 నుంచి 30 వరకు ఎస్ ఈ సిఈఎన్ఎస్ యుఎస్. జిఓవి. ఇన్ పోర్టల్ నందు ప్రజలే స్వయంగా తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకోవచ్చున్నారు. జనగణనలో 33 ప్రశ్నలతో కుటుంబ స్థితిగతుల వివరాలు నమోదు చేస్తారని, వివరాలు గోప్యత ఉంటుందనీ తాహసిల్దార్ తెలిపారు.

## రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా కిడ్స్ కాన్వోకేషన్





**పెందుర్తి, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** స్థానిక సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో కిడ్స్ కాన్వోకేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ (విశాఖ డివిజన్--1, పి.బి.వల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నేటి బాలలే రేపటి బాధ్యతాయుత పౌరులు. వారి భవిష్యత్తును సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఎంతో అవసరం. ఇలాంటి కాన్వోకేషన్ కార్యక్రమాలు చిన్నారుల్లో ధైర్యాన్ని పెంచి, వారికి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయి బిందు మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ విధమైన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. "చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇది వారి భావి జీవితానికి బలమైన పునాది వేస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జ్ వెంకటేష్, సీజీఎం వసంత, జీఎం కె. రమ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మొత్తంగా, ఈ కిడ్స్ కాన్వోకేషన్ వేడుక విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబిస్తూ, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు ఆనందాన్ని పంచిన స్ఫూర్తిదాయక కార్యక్రమంగా నిలిచింది.

## చందనోత్సవానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు
## సమన్వయంతో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 11:** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఏప్రిల్ 20 న నిర్వహించనున్న చందనోత్సవా న్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. సమ న్వయం, సమష్టి కృషితో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాన్ని నిర్వహించా లని మంత్రులు అధికారులను ఆదేశించారు.

శనివారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించి న సమీక్ష సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇన్ చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వా మి, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు ఆధ్వర్యంలో చందనోత్సవం వంటి ప్రధాన ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేక మం త్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు దేవాదా య శాఖ మంత్రి తెలిపారు. ఈసారి జిల్లా కలెక్ట ర్‌తో పాటు దేవాదాయ శాఖ కమిషనర్‌ను కూడా ఇన్‌చార్జ్ ప్రత్యేక అధికారిగా నియ మిం చామని చెప్పారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉం చుకుని ట్రాఫిక్ నియంత్రణ, రవాణా సౌకర్యా లు, పోలీస్ భద్రత, దర్శన ఏర్పాట్లు సమన్వ యంతో చేపట్టాలని ఆదేశించారు. వీఐపీల దర్శనానికి ఉదయం 5 గంటల వరకు మాత్రమే సమయం కేటాయించి, అనంతరం సాధారణ భక్తులకు ఉచిత మరియు చెల్లింపు దర్శనాలను సజావుగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ చందనోత్స వం రోజున సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని అన్నారు. క్యూ లైన్లలో వాలంటీర్లను నియమించి భక్తులను క్రమబద్ధంగా పంపించా లని, తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేక జాగ్ర త్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు వంటి సదుపా యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రతి శాఖ బాధ్యతతో వ్యవహరించాలని, ఎస్‌వోపీ ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని షెల్టర్లు, పందాల్స్, జర్మన్ షెడ్లు బలంగా ఏర్పా టు చేయాలని ఆదేశించారు. విభాగాల మధ్య సమన్వయం లోపించకుండా అందరూ సేవా భావంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దర్శన టిక్కెట్ల కోసం ఆన్లైన్ పోర్టల్‌ను మంత్రులు ప్రారంభించారు. తొలి టిక్కెట్‌ను దేవాదాయ శాఖ మంత్రి స్వయంగా కొనుగోలు చేశారు. సోమవారం నుంచి ఈ టిక్కెట్లు ఆన్లైన్‌లో అందుబాటులోకి రానున్నట్లు దేవస్థానం ఈవో వెంకటరావు తెలిపారు. ఏపీటీఎస్ సాయంతో సులభంగా టిక్కెట్లు పొందే విధంగా ఈ పోర్టల్ రూపొందించబడింది.

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.

## వైసిపి జిల్లా బీసీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మా పూలే జయంతి



**రాజమహేంద్రవరం , పెన్ పవర్,ఏప్రిల్ 11:**మహాత్మ పూలే అంబేద్కర్ ఆలోచన విధానంతో ప్రజల అభ్యున్నతి కోసం మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన సాగించారని రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం దివాన్ చెరువు గ్రామంలోని విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జడ్పిటిసి బీసీ సంఘం నాయకులు వాసంశెట్టి పెద్ద జయంతి వేడుక నిర్వహించారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల విద్య, సమానత్వం కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడన్నారు. ఆయన చూపిన మార్గం ఇప్పటికీ సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. సమాజంలో నిజమైన అభివృద్ధి అందరికీ సమాన అవకాశాలు కల్పించడమేనన్నారు. సమాజంలో అందరికీ విద్యా అందాలని ఆయన సతీమణి సావిత్రిబాయిపూలే కృషి చేశారన్నారు. వైఎస్ఆర్సిపి జిల్లా బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు జడ్పిటిసి వాసంశెట్టి పెద్దా మాట్లాడుతూ మహాత్మా పూలే సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్గాల శ్రీనివాస్, పలివెల స్వామి, కొల్లేపల్లి వీరభద్రరావు, నేలపాల శివరామకృష్ణ, అంకం దొరబాబు, చిటికెన తరుణ్ వివిధ నాయకులు పాల్గొన్నారు.

## మన్యంలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్య.

* ప్రజల వద్దకువెళ్లి సమస్యలు తెలుసుకున్న డాక్టర్. వంపూరు గంగులయ్య.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 11.**ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని జనసేన పార్టీ అరకు పార్లమెంట్, పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య స్పష్టం చేశారు. జనసేన పార్టీ పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు కూడ రామకృష్ణ ప్రత్యేక ఆహ్వానం మేరకు.. శనివారం ఆయన లోతుగడ్డ జంక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీకి విచ్చేసిన డాక్టర్ గంగులయ్యకు కూడ రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సిరిపురం, చింతల వీధి, భీమన్న వీధి, కొమ్మంగి, రౌరింతాడ గ్రామాలలో పర్యటించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు తమ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా పక్కా రహదారులు నిర్మించాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించుకుంటూ ఆయనకు అర్జీలు అందజేశారు. ప్రజల సమస్యలపై స్పందించిన గంగులయ్య.. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్ల సమస్యపై ఉన్నతాధికారులతో చర్చించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని తక్షణమే పరిశీలించేలా అధికారుల నుంచి హామీ ఇప్పించారు. రహదారుల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలతో పాటు పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు కూడ రామకృష్ణ, పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, జీమాడుగుల మండల అధ్యక్షుడు మసాడి భీమన్న, చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి చిన్నిరాజుబాబు, రింతాడ పంచాయతీ అధ్యక్షుడు కొయ్యం ఇమ్మానుయేలు, పీసా కార్యదర్శి లక్ష్మణరావు, ఇతర నాయకులు జయరాజ్, రామరాజు, సతీష్, గబులంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 13 వ వార్డులో జ్యోతిరావు పూలే జయంతి





**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్:** భారత సామాజిక తత్త్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు మహాత్మా జ్యోతిరావు పూలే 200 వ జయంతి సందర్భంగా 13 వ వార్డు,సెక్టర్ 5, కనకమహాలక్ష్మినగర్ లో జ్యోతిరావు పూలే సేవాసమిత ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించిన ముఖ్య అతిధి వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు. పూలే గారి విగ్రహానికి నివాళులు అర్పించి జ్యోతిరావు పూలే చేసిన త్యాగాలు,పోరాటాలు, సేవలు గురించి కొనియాడి ప్రజలకు తెలియ పరిచారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షులు నీలి పైడిరాజు, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి బాలస్వామి, ఉపాధ్యక్షులు కశ్రీనివాస్ టీడీపీ సీనియర్ లీడర్ పి.ఐ బాలరాజు, పట్టా నూకరాజు వడిశెల శ్రీనివాస్,మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రి మణి, బీసీ సెల్ కార్యదర్శి మహాపాత్రో గోపికృష్ణ,అడ్డూరి వెంకటరమణ, పైడిరాజు, నాగేశ్వరావు,కనకల శ్రీను,గంటా దేవి,రమ,లాలు, బుగత దుర్గ,కుమారి, తదితరులు పాల్గున్నారు.

పెన్ పవర్

ఆదివారం 12 ఏప్రిల్ 2026

# అభిషేక్-హెడ్ తుఫాన్ బ్యాటింగ్.. పంజాబ్ కింగ్స్ టార్గెట్ ఎంతంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో జరుగుతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ పంజా విసిరింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఎస్ఆర్?హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకరమైన బ్యాటింగ్ తో విరుచుకుపడగా, మరోవైపు హెడ్ మాత్రం బౌండరీలు బాదుతూ పంజాబ్ బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. ఈ క్రమంలో అభి ఫాస్టెస్ట్ 50 అందుకున్నాడు. 18 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడీ లెఫ్ట్ హ్యాండర్. అతని దెబ్బకు సన్ రైజర్స్ హైదరాబాద్ స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలో శశాంక్ సింగ్ బౌలింగ్ లో ఈ ఓపెనర్లు ఇద్దరు పెవిలియన్ కి చేరుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్ కి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. కానీ 9వ ఓవర్ వేసిన శాశంక్ సింగ్ బౌలింగ్ లో ఫస్ట్ బంతికే ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 5 ఫోర్లు 1 సిక్సులతో 38 పరుగులు) అవుట్ అయ్యాడు. హాఫ్ సెంచరీతో చెలరేగిన అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు 8 సిక్సులతో 74 పరుగులు)ని కూడా అదే ఓవర్లో శాశంక్ వేసి స్లో బాల్ కి వికెట్ ఇచ్చేసి అభి పెవిలియన్ కి చేరుకున్నాడు. దీంతో ఒకే ఓవర్లో రెండు వికెట్లు నష్టపోయి ఇబ్బందుల్లో పడింది.

అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ సన్ రైజర్స్ జట్టు నెట్ రన్ రేట్ తగ్గకుండా జాగ్రత్తగా బ్యాటింగ్ చేశారు.. ఈ క్రమంలో అర్షదీప్ బౌలింగ్ లో డీప్ వికెట్ మీదుగా ఆడిన భారీ షాట్ కి బౌండరీ లైన్ దగ్గర మార్కో యాన్సెన్ క్యాచ్ పట్టడంతో ఆరెంజ్ ఆర్మీ కెప్టెన్ ఇషాన్ ( 17 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సుతో 27 పరుగులు) మైదానం వీడాడు. తర్వాత పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో అనికేత్ వర్మ-- క్లాసెన్ సుమారు 2 ఓవర్ల పాటు నెమ్మదిగా బ్యాటింగ్ చేశారు.

ఇక 16వ ఓవర్ నుంచి మళ్లీ బ్యాటింగ్ లో ఆరెంజ్ ఆర్మీ దూకుడు పెంచింది. యుజేంద్ర చాహల్ వేసిన మొదటి బంతిని సిక్స్, మూడో బాల్ ని ఫోర్ కొట్టి మంచి ఊపుమీదున్న అనికేత్ వర్మ (18) రనౌట్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన సలీల్ ఆరోరా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. కేవలం 9 రన్స్ మాత్రమే చేసి వెనుదిరిగాడు. ఇక చివర్లో క్లాసెన్ కూడా పెవిలియన్ కి చేరడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు 219 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ ముందు 220 పరుగుల టార్గెట్ ఉంది. పంజాబ్ బౌలర్లలో శాశంక్ సింగ్, అర్షదీప్ సింగ్ తలో రెండు వికెట్లు తీసుకోగా, జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు.

# అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్.. సన్‌రైజర్స్‌పై భారీ టార్గెట్‌ను ఊదేసిన పంజాబ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద కొనసాగుతోంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (69 నాటౌట్), ప్రియాన్ష్ ఆర్య (57), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (51) హాఫ్ సెంచరీలతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ సన్‌రైజర్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో పంజాబ్ గెలుపు సులువే అనిపించింది. అయితే, సన్‌రైజర్స్ బౌలర్ శివాంగ్ కుమార్ (3/33) ఒకే ఓవర్‌లో వీరిద్దరినీ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తనదైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (38)తో కలిసి తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరి దూకుడుతో సన్‌రైజర్స్ భారీ స్కోరు చేయగలిగినా, బౌలర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు.ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ చరిత్రలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. డే/నైట్ మ్యాచ్‌లో 215కు పైగా పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన తొలి జట్టుగా నిలిచింది. ఈ భారీ ఛేదనతో పంజాబ్ జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు కాగా, మరోసారి బౌలింగ్‌లో విఫలమైన సన్‌రైజర్స్ కు నిరాశ తప్పలేదు.

# చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య కీలక మ్యాచ్.. ఈ పోరులో ఎవరు గెలుస్తారంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆసక్తికరమైన పోరు జరగనుంది. ఈ మ్యాచులో గెలిచి టోర్నీలో ఖాతా ఓపెన్ చేయాలని ఎల్లో ఆర్మీ చూస్తుండగా.. చెన్నపై విజయం సాధించి గుజరాత్ పై ఒక్క రన్ తేడాతో ఓడిన బాధని దిగమింగుకోవాలని చూస్తుంది. దీంతో ఈ రెండు జట్లకి మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. చెన్నై సూపర్ కింగ్స్ : ఈ సీజన్‌లో చెన్నై ఆటతీరు ఫ్యాన్స్ ని తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన సీఎస్‌కే, బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతోంది. ఫామ్ కోల్పోయిన సంజూ శాంసన్ ఈ మ్యాచులో ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. జట్టుకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, విధ్వంసకర బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి రావడం. అతని రాకతో సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్ మరింత బలోపేతం కానుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ : అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉంది. గత మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన పోరులో కేవలం ఒకే ఒక్క పరుగుతో ఓడిపోయినప్పటికీ, ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏమాత్రం తగ్గలేదు. డేవిడ్ మిల్లర్ గత మ్యాచ్‌లో అద్భుతంగా ఆడినప్పటికీ తృటిలో విజయాన్ని దక్కించులేకపోయారు.

**పిచ్ రిపోర్ట్:**

సాధారణంగా చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది, కానీ ఇటీవలి కాలంలో ఇక్కడ భారీ స్కోర్లు నమోదు అవుతున్నాయి. బ్యాటర్లకు స్వర్గధామంగా మారిన ఈ పిచ్‌పై మరోసారి పరుగుల వరద పారే ఛాన్స్ ఉంది. ఈ ఫ్లాట్ ట్రాక్‌పై టాస్ గెలిచిన జట్టు భారీ స్కోరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటుంది.

**ఎవరు గెలుస్తారంటే?**

ప్రస్తుత ఫామ్ ప్రకారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిని గెలిచిన ఢిల్లీ, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతుంది. ఈ మ్యాచ్ గెలిస్తే వారు మూడో స్థానానికి వెళ్తారు. కానీ డెవాల్డ్ బ్రెవిస్ రాకతో చెన్నై కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.



# ఒకరితోనే డేటింగ్ అతడితోనే పెళ్లి!



ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి వ్యక్తిగత జీవితంపై పూర్తి క్లారిటీతో ఉందా? అంటే అవుననే అనాలి. నేటి తరం యువత డేటింగ్ సంస్కృతిపై భిన్నమైన అభిప్రాయాలతో ఉన్నప్పటికీ కృతి మాత్రం పాత తరం విలువలకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పుకొచ్చింది. తాను ఎవరితోనైనా డేటింగ్ చేస్తే? అది కేవలం పెళ్లి కోసమే ఉంటుందని ఒకరితోనే ప్రేమ.. అతడితోనే జీవితం అనే సూత్రాన్ని తాను నమ్ముతానని వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు ఆమెలోని పరిణతిని, సంప్ర దాయాల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతున్నాయి. ప్రేమ , పెళ్లి విషయంలో కృతి శెట్టికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉన్నట్లు కనిపిస్తుందని ఆమె మాటలతో అర్థమవుతుంది. ప్రస్తుతానికి కృతిశెట్టి దృష్టి సినిమాలపైనే ఉందని మరో ఐదేళ్ల వరకు ప్రేమ లేదా పెళ్లి అనే ఆలోచనే తన దరిదాపుల్లోకి రాదని స్పష్టం చేసింది. ఐదేళ్ల తర్వాత మాత్రమే తన వ్యక్తిగత జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకుంటానని అప్పటి వరకు తన శక్తిని, సమయాన్ని నటనకే కేటాయిస్తానని పేర్కొంది. ప్రేమ అనేది ఒక బాధ్యత అని సరదా కోసం చేసే పని కాదని కృతి అభిప్రాయపడింది. తాను పెళ్లాడబోయే వ్యక్తి తనను అర్థం చేసుకునేవాడై, తన వృత్తిని గౌరవించే వాడై ఉండాలంది. డేటింగ్ పేరుతో సమయాన్ని వృధా చేయడం కంటే ఒకే వ్యక్తితో బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడమే ఉత్తమమని అమ్మడు నమ్ముతోంది. గ్లామర్ ప్రపంచంలో ఉంటూ ఇంతటి స్థిరమైన ఆలోచనలు కలిగి ఉండటం విశేషం. కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి స్పష్టత ఉండటం వల్ల వృత్తిపరంగా ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంది. చాలామంది నటీమణులు కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు రూమర్ల బారిన పడుతుంటారు. అయితే కృతి శెట్టి ముందే ఇలాంటి ప్రకటన చేయడం ద్వారా అనవసరమైన గాసిప్స్‌కు చెక్ పెట్టినట్లయింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లోనూ అవకాశాలు దక్కించుకుంటున్న మంగళూరు భామ నటనతో ప్రేక్షకులను మెప్పించడమే పరమావధిగా భావిస్తుంది.కృతి శెట్టి కెరీర్ పై ఉన్న స్పష్టతతో ఇటు నిర్మాతలకు, అటు అభిమానులకు ఒకరకమైన భరోసా ఇచ్చినట్లే. ఐదేళ్ల పాటు కేవలం వెండితెరపైనే కనిపిస్తానని చెప్పడం ఆమె అంకితభావాన్ని సూచిస్తోంది. దీంతో నిర్మాతలు నిశ్చింతగా సినిమాలు చేసుకోవచ్చు. కృతి శెట్టి ఫాలోవర్స్ అమ్మడి కోస ప్రయత్నాలు చేయొచ్చు. ఈ బ్యూటీ నటించిన ఎల్ ఐ కె సినిమా కొన్ని గంటల క్రితమే రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయంపై అమ్మడు చాలా ఆశలే పెట్టుకుంది. అలాగే తెలుగులోనూ ఓ అగ్ర హీరో ప్రాజెక్ట్ కు సైన్ చేసింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptnam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com